# ధర్మబుద్ధి

(కథానిక)

చరచరా నిలువుటద్దంముందు పౌడరు పూసుకొని మొలలోవున్న రుమాలుతీసి నుదిటిమీది తిలకం సరిచేసుకుంది లీలావతి. ఆనాటికానాడు తనమొహంలో కొత్తశోభ తళుకెత్తుతూన్నట్లు తోచిందామెకు. ఇంతలో బయటనుంచి కారు హారన్ వినిపించగా, ఖంగారుగా చేతిసంచీ తగిలించుకొని, ఎత్తుమడమల బూట్లమీద టకటకా నడుస్తూ వీధితలుపు తెరచింది. ధర్మలింగం కారులోనే కూర్చుని సన్నగా ఈలవేస్తున్నాడు. లీలావతి తలుపుతీసి, కాంపౌండుగేటు తోసుకువచ్చి, "ఏం, లోపలికి వచ్చి కూర్చోలేకపోయారూ" అంది. "అబ్బే, దానికేం ఇక్కడమాత్రం నిలబడి వున్నానా?" అన్నాడతడు. ఇంతలో ఆవిడ కారులో కూర్చుని చీరకుచ్చెళ్లు సర్దుకుని టపీమని తలుపువేసుకుంది. కారు నెమ్మదిగా తారురోడ్డుమీద జారుతూ పోతూంది. లీలావతీ, ధర్మలింగమూ ఎవరి పరధ్యానంలో వారున్నారు.

లీలావతి గతచరిత్ర ఒక తేనెపట్టు లాంటిది. అందులో తేనె మాధుర్యంకన్నా ఈగలజోరే ఎక్కువ. అందుకే ఆమె స్వగ్రామంనుండి, బంధుకోటినుండి తప్పించుకొని ఇంతదూరం వచ్చేసింది. ఇప్పుడామె ధర్మలింగం ఆధ్వర్యం వహిస్తున్న ఒక పాఠశాలలో అధ్యాపకురాలు. జీతం నెలకు నూట ఏభై. స్కూలుకు దగ్గరగానే నివాసం ఒక చిన్న మేడలో. వంటమనిషి తప్ప వేరే ఏ బెడదాలేదు. చిల్లర ఖర్చులు కూడా చాలవరకు ధర్మలింగమే భరిస్తున్నాడు. ఎంతో చాకచాక్యముతో నడచుకుంటూ వూరిలో పెద్దమనిషని పేరు తెచ్చుంది లీల.

ధర్మలింగం ఆ వూరిలోని కుబేరులలో ఒకడు. వయస్సు ఏభైకి ఒకటికి అటోయిటో వుంటుంది. అయినా నేయి చమురులతో పెరిగిన శరీరం కనక మనిషి దుక్కలావుంటాడు. రంగుకు చింతపిక్క. నాలుగేళ్ళక్రితం భార్యా వియోగం కలిగి, మతిచలించి ఒక సంవత్సరం పిచ్చివానిలా ప్రవర్తించేడు. కాని ఇంతలో లీలావతి స్నేహం లభించి, మళ్ళీ తేరుకుంటున్నాడు. మనిషిలో దైవభక్తి మెండు. తన గడపత్రొక్కి చెయ్యిచాచిన వాళ్లనెన్నడూ వూరికే పంపలేదు. కాలేజీఫీజు కట్టుకోలేని విద్యార్థులు, అన్నపానాలకులోనైన పాటకజనం, వివాహాది కార్యాలు జరుపలేని గృహస్థులు ఒకరేమిటి ఎందరెందరో ఆయనవల్ల సహాయము పొందేరు. ఒకరిమాటెందుకు లీలావతి ఆ వూరుకి ఏ స్థితిలో వచ్చిందో ఒక్కసారి చూచుకుంటే ఆవిడే వొప్పుకుంటుంది అతని దాతృత్వబుద్ధిని.

లీలావతిని అక్కడ అందరూ "మిస్. లీల" అని పిలుస్తారు. అలా అనిపించుకోడం ఆమెకు సరదా కూడా. ఇప్పుడామె వయస్సు ఇరవైఆరు. శరీరం ఎండలో ఆరబెట్టిన గోధుమల వర్ణంలా వుంటుంది. తొలితారుణ్యపు కాంతిరేఖలింకా ఆమె ముఖంలో మెరుస్తూనే వుంటాయి. ఆమె చూపులు చంద్రకిరణాలవలె చల్లగానూ, మెరుపుతీగలవలె తీక్షణంగానూ వుంటాయి. వాటివెనుక వున్నది అమృతమో, హాలహలమో, తెలుసుకుందుకెందరెందరో ప్రయత్నిస్తుంటారుగాని మళ్ళీ ఏ అగాధతలాల్లో చిక్కుకుపోతామోనని వెరచి వెనుదీస్తుంటారు. ఇంకా ఆ అన్వేషణలోవున్న వాళ్లిద్దరే. ఆమె వారిరువురికీ మధ్య అందరాని చందమామలా తళతళలాడి అర్రులు చూపించి వినోదిస్తూంది. కాని, రానురాను తాను త్రవ్విన గోతిలో తానే పడడం లేదుగదానని ఆమెకు సందేహం కలుగుతూంది.

కారు నడుపుతూన్న ధర్మలింగం వెనుదిరిగి.

"వాడింకా ఏమైనా అన్నాడా?" అన్నాడు.

పరధ్యానంలో వున్న లీలావతి "ఎవరు?" అంది.

"వాడే, విస్సిగాడు."

జయంతి శ్రీరామమూర్తి

"ఇంకేంలేదు. అన్నా వినిపించుకునే దెవరు?" అంది లీల మెల్లగా.

"అయినా జాగ్రత్త. పాము చిన్నదైనా కర్ర పెద్దది కావాలి. విషవృక్షాన్ని మొగ్గలోనే తుంచెయ్యడం మంచిది" అన్నాడు ధర్మలింగం.

"ఏం ఫరవాలేదు - నా కామాత్రం తెలియదా?" అంది లీల.

"ఏమో, ఎందుకైనా మంచిదని చెప్పేను. ఈ కాలపు కుర్రాళ్ళని నమ్మేందుకులేదు. ప్రేమంటూ తీసుకెళ్ళి ఎంతమంది పిల్లల్ని నడి సముద్రంలో విడిచిపెట్టలేదు?"

"పిల్ళవల్లలో పడేవాళ్ళది కూడా తప్పుండాలి" అందామె నిశ్చింతగా. ఇంతలో సినీమా హాలు వచ్చేసింది. ఇద్దరూ కారు దిగేరు.

హాలు కుర్రాడు ఇద్దర్నీ తీసుకువెళ్ళి రిజర్వు సీట్లు చూపించేడు. అప్పటికే ఆట ప్రారంభమైపోయింది. జనం నిండిపోయారు. లీలావతి సినీమా హాలులో కూర్చుందన్నమాటేగాని ఆమె మనస్సు అక్కడలేదు. ఆమెకళ్లు తెరవైపు చూస్తున్నాయేగాని దృష్టి అక్కడలేదు. ఆమెలో బలమైన ఆలోచనా ప్రవాహం కట్టలు తెగుతూంది. తాను ధర్మలింగాన్నుంచి ఎంతో మేలు పొందింది. తన వూరునుంచి నిరాధారంగా పరుగెత్తుకొచ్చిన నాడు, రైలుస్టేషనులో బెంచీమీద కూర్చున్న తననుచూసి, జాలిపడి పలుకరించి ఇంతవరకూ తెచ్చిన దైవసముడాయన. ఈనాడు తాను నోరు తెరచి ఏది అడిగినా యిచ్చేస్తాడు. కాని తానాయనకు తిరిగి చెయ్యగలిగిన దొక్కటే! కాని అది సంభవమా? మేడలూ, కార్లూ, ఉద్యానవనాలూ...వీటికి లోటుండదు. తన మేనమామకు బుద్ధిచెప్పి అతనిమీద కొన్ని వేలు గుమ్మరించనూ వచ్చు. కాని ఇంతలోనే ఏదో భయం కలిగిందామెకు. ఇంతవరకూ పితృసమునిగా చూసుకుంటూన్న అతనిని భర్తగా చూచుకోడం దుర్భరమనుకుంది. ధర్మలింగం వయస్సు, రూపం, ఆయన నలుగురు పిల్లలూ...ఏవేవో జ్ఞప్తికి వచ్చేయి. తలనొప్పివచ్చి కళ్ళవెంబడి నీళ్లు కారడం మొదలుపెట్టేయి. చీర చెరగుతో కళ్లు వొత్తుకుంటూంటే ధర్మలింగం చూసి,

"ఏం వొంట్లో బాగాలేదా?" అన్నాడు.

"నా కిక్కడేం బాగాలేదు. ఇంటికిపోదాం" అంది లీల.

ధర్మలింగం ఆమె మాట నెన్నడూ కాదనడు. ఇద్దరూ లేచి వచ్చేశారు. లీలావతి ఇంటిలోపల అడుగు పెట్టేసరికి విశ్వనాథం అక్కడే వున్నాడు. అతనికి పాతికేళ్లుంటాయి. తెల్లని మల్లుపంచా, గ్లాస్గో లాల్చీ తొడుక్కున్నాడు. ధర్మలింగాన్ని చూసీ చూడడంతోనే లేచి నమస్కారం చేసేడు. ధర్మలింగం వికృతంగా చేతులు త్రిప్పుతూ.

"చాలుచాలు నక్కవినయా లక్కరలేదు" అంటూ ఓ పొడుగాటి సోఫాలో కూలబడ్డాడు. లీలావతి అతని ప్రక్కనే కూర్చుంది. విశ్వనాథం వేరేదాల్లో కూర్చున్నాడు. అతనికి ధర్మలింగం మాటలు విని ఆశ్చర్యంవేసింది. తన స్కూలు యజమానికి తనమీద కోపంగా వుందని ఇదివరకే తెలుసు. అందులో లీలావతి యింటివద్ద తాను కనబడితే ఆయన కొకటే మంట! కాని తానేం చెయ్యగలడు? తన మనస్సును లీలపైనుంచి మరల్చడం అతనికి చేతకావడంలేదు. దానికితోడు లీలకూడా.అవును, కాదు అని చెప్పక "ఆలోచిద్దాం తొందరదేనికి" అంటూనే వస్తూంది. పోనీ ఆమె డబ్బులేదని సంకోచిస్తోందా అంటే తానో నూటయేభై, ఆమె నూటయేభయి తెచ్చుకుంటున్నారు గదా? ఆశకి అంతేమిటి?

"మొన్న లీలమ్మతో ఏమిటయ్యా అన్నావట?" అన్నాడు ధర్మలింగం.

"ఏమన్నాను?" అంటూ లీలవైపు చూసేడు విశ్వం. ఆమె చిరునవ్వుతో తిరిగిచూసింది.

"ఏదో ప్రేమ మొలుచుకొచ్చిందట నీలో" అన్నాడు ధర్మలింగం.

"అవును. ఇందులో తప్పేముంది? యిష్టం వుంటే పెళ్ళిచేసుకుందామని అడిగేను. లేకపోతే లేదనవచ్చు"

"చాలుచాలు. నీకు సిగ్గులేదా అలా అడగడానికి..." ధర్మలింగం. విశ్వనాథం ఒళ్లుమండి ఇలాగన్నాడు.

"ఇంతకీ ఇది మా ఆంతరంగిక విషయం దీనిలో జోక్యం కలిగించుకుందుకు తమరెవరు?" ధర్మలింగం ఉగ్రుడయ్యేడు.

"ఎవర్నా? చూపిస్తా. ఉద్యోగం ఊడపీకిస్తాను. అప్పుడు తెలుస్తుంది."

ఇంతలో లీలావతి కలిగించుకొని "పోనిస్తురూ ఆయనతో మనకెందుకు" అంటూ ధర్మలింగం చేతులు పట్టుకుని కాస్త ఉపశాంతి కలిగించింది. విశ్వనాథం లేచి చురచురా చూసి వెళ్లిపోయాడు ఆ తర్వాత కాస్సేపటికి.

"భోజనంచేసి వస్తానని" ధర్మలింగం లేచేడు. అతడు వెడుతూంటే "నాకు కొంచెం సొమ్ము అవసరం వుంది. వచ్చేటప్పుడు చెక్కు బుక్కు తీసుకురండి" అంది లీల.

"ఎంత కావాలి?" అన్నాడు ధర్మలింగం చిరునవ్వుతో.

"చెబుతాగా. తీసుకురండి" అంటూ అతన్ని సాగనంపింది.

లీలావతి భోజనం చేసి, పాలుత్రాగి ముఖమల్ పంజాబీ సూటు ధరించింది. రెండు జడలువేసుకుని, వాటికి వంతెనగా మల్లె దండ కట్టుకుంది. పట్టు చడావులు వేసుకుని బాల్కనీలో పచారుచేస్తూంది. అప్పుడే ఉదయించిన చంద్రుడు ఆమె మనస్సుతో చెలగాటం ఆడుతున్నాడు. మేడ ఎత్తునా పెరిగిన సంపెంగ చెట్టు విరబూసి మత్తెక్కిస్తోంది. ఆమెలో వాంఛాప్రవాహం విజృంభించింది. తానింత అందంగా పుట్టడం ఎందుకో అనుకుంది. తనకింక శాంతి అనేది లభించదా? పోనీ తిరిగి స్వగ్రామానికి వెళ్ళిపోతేనో? తన చిన్ననాటి పెళ్ళి చనిపోయిన భర్తా, క్రూరుడైన మేనమామ... ఏవేవో జ్ఞాపకంవచ్చి క్రుంగిపోయింది. ఇంతలో కారుహారన్ వినిపించింది. ధర్మలింగంగాక మరి యెవరు వస్తారు? "సరే-ఇంక ఆలోచించే శక్తి నాలో లేదు. ఈవేళ ఎల్లాతోస్తే అలాగ చేసేస్తాను. ఏది ఎలా జరగాలో అలా జరక్కమానుతుందా" అనుకుంటూ క్రిందికి దిగివెళ్ళింది.

కారు తిన్నగాపోయి బీచిగట్టున ఒక సిమెంటు బెంచీవద్ద ఆగింది. ధర్మలింగం కారు దిగి ఆమెకు చెయ్యి అందిచ్చేడు. ఆమె వయ్యారంగా దూకింది ఇసుకమీదకు. ఇద్దరూ బెంచీ మీద కూర్చున్నారు. చుట్టుప్రక్కల ఎవ్వరూ లేరు. సముద్రపు హోరుమాత్రం హెచ్చి కలత చెందుతూన్న ఆమె ఆవేదన కప్పిపుచ్చుతోంది.

ధర్మలింగం ఆమె బుజాలుని నిమురుతూ,

"లీలా! ఇంకెంతకాలం నన్నిలా వేధిస్తావు" అంటూ జడలోని పువ్వులుని వాసనచూసేడు. ఆమె కాస్త జరిగింది. అతడూ జరిగేడు. ఆమె లేచి నిలబడింది. అతడూ నిలబడ్డాడు. ఆమె లేడిలా అటూయిటూ పరుగెత్తింది. అతడు కొంచెం పరుగెత్తి ఆ ఇసుకలో కూలబడ్డాడు. ఆమె అతన్ని సమీపించి, "ఏం కోపం వచ్చిందా?" అంది.

"లే"దని తలవూపాడు. ఆమె ఒక్కక్షణం ఇలాగంది, "అయితే మీరు నన్ను ప్రేమిస్తున్నారా?"

"నాప్రాణ సమానంగా."

"మరి నేను మిమ్మల్ని ప్రేమించడంలేదే!"

"లేదా" అంటూ వెర్రిగాచూసేడు ధర్మలింగం.



"అవును. మిమ్మల్ని పూజించగలను. ప్రేమించ లేను. మీరు నాకుచేసిన ఉపకారం జన్మలో మరవ లేను. కాని ప్రత్యుపకారం చెయ్యలేను" అంది లీల. ఆమె కన్నులలో కరుణరసాన్ని చూసిన ధర్మ లింగం, "అవునుగాని లీలా, చెక్కుబుక్కు తెమ్మ న్నావు. ఎంతరాయను?" అంటూ పుస్తకమూ, కలమూ చేతబుచ్చుకున్నాడు.

"మన పెళ్ళైగనక నిజమయితే నాకో పాతిక వేలు కావాలి" అంది.

"ఓస్. ఇంతేనా? రాస్తాను మరి?" అన్నాడు.

"వుండండి. కాస్త ఆలోచించనియ్యండి—" అంటూ లీల ఇటూ అటూ చూచింది. పైన ఆకా శము క్రింద భూమి వంకా చూసింది. ప్రక్క నున్న సముద్రుని చూసింది.

"సరే నువ్వే రాసుకో. సంతకంచేసి యిస్తు న్నాను" అంటూ ధర్మలింగం ఆ పుస్తకం ఆమె మీద పడవేసేడు.

ఆమె పరపరా పాతికవేలకు చెక్కురాసుకుని, దాన్ని తీసిమడిచి బ్లౌజుకాలరులో దూర్చుకుంది.

"సరే ధర్మలింగంగారూ! ఇక మంచిరోజు చూపించంచండి. ఆఖరికి గెలుపుమీదే" నంటూ లేచింది – విజయోన్మాదంతో మైమరచిన ధర్మ లింగం ఆమెననుసరించేడు.

ఆ మర్నాడు ధర్మలింగం నలుగురు సిద్ధాం తులు నడిగేడు. నలుగురు నాలుగు తేదీలు చెప్పేరు. అవి తీసుకుని సాయంత్రం నాలుగింటికి లీల ఇంటికి వచ్చేడు. పనిమనిషి ఎదురువచ్చి "ఇంట్లోలేరు కూర్చోమంది" అలాగే కూర్చుని ఆపేపరూ ఈపేపరూ తిరిగేస్తూ మధ్యమధ్య గోడమీదవున్న లీలావతి ఫోటో ఎన్లార్జిమెంటు కేసి చూస్తూ, ఆమె రాకని వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నాడు ధర్మలింగం. ఇంతలో ఒకటాక్సీ వచ్చి ఆగింది ఇంటిముందు, అందులోంచి లీలా వతీ, ఓ పురుషుడు దిగేరు. ధర్మలింగం చూసి తనకళ్లని తానే నమ్మలేకపోయాడు. లీలావతీ విశ్వనాథమూ వస్తున్నారు లోనికి! వాళ్ల మెడల్లో పూలదండలున్నాయి. వాళ్లు సరాసరివచ్చి ధర్మ లింగంవాళ్లకి నమస్కారం చేస్తున్నారు. అతడు అదిరిపడి "ఏమిటిది?" అన్నాడు. జవాబు లేదు. "ఏమిటిదంతా?" అన్నాడు మళ్ళీ బిగ్గరగా లీలా వతి జవాబు చెప్పింది.

"మేమిద్దరం ఈవేళ రిజిష్టర్డు వివాహం చేసు కున్నాం" ధర్మలింగం "ఆ!" అన్నాడు. అతని మొహంలో కత్తివేస్తే నెత్తురు చుక్కలేదు. ఆ మేడ తలక్రిందులైపోయినా బాగుండుననిపించిం దతనికి.

"ఆఖరికి వీడినా నువ్వు పెళ్ళాడేది?" అన్నా డేల్లాగో.

"ఇదంతా విధినిర్ణయం. అయినా ఆయనకేం లోటు ముదుసలా? అనాకారా?" అంది లీల. ధర్మలింగం తగ్గిపోయాడు. ఆ రెండు విశేషణాలూ తనకి వర్తిస్తాయి. ఒక స్త్రీ యవ్వనాన్ని అన్ని వేళలా డబ్బుతో జయించలేనని తెలుసుకున్నాడు. అయినా లీలావతిమీద అతనికోపం చల్లారక "నువ్వింత మోసకత్తెవని ఎన్నడూ అనుకోలేదు" అన్నాడు.

"క్షమించండి ధర్మలింగంగారూ! ఇందులో మోసమేమీలేదు. ఇదుగో మీ చెక్కు" అంది. ధర్మలింగం చటాలున ఆకాగితం లాక్కుని జేబులో పెట్టుకుని, వెళ్ళిపోతూండగా లీలావతి అడ్డంవచ్చి "ఈ సాయంత్రం ఆరుగంటలకు టీ పార్టీవుంది. మీరు తప్పకరావాలి. మీరే నాకీ పూళ్ళో తల్లి అయినా తండ్రి అయినా" అంది. అతడు సన్నంగా నవ్వి, చూపులు శూన్యంలో నిగిడ్చి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం టీపార్టీ జరిగింది. స్కూలు టీచర్లు, విద్యార్థులూ ఎందరెందరో వచ్చేరు. ధర్మలింగం తన నలుగురు పిల్లలనూ వెంటపెట్టుకు రావడంవల్ల లీలావతి ఆనందం రెండింతలయింది. అనంతరం వాళ్లు వెళ్ళిపోతూంటే విశ్వనాథమూ లీలావతీ సాగనంపడానికి రోడ్డుమీదికి వెళ్ళేరు. కారులో లైటుస్విచ్చివేసి ధర్మలింగం లీలావతి వైపుచూచి చెయ్యిచాపేడు. ఆమె ఆశ్చర్యపడింది. అదే చెక్కు కాగితం—దాన్ని అందుకుందు కామెకు చేతులురాలేదు.

"ఫరవాలేదు తీసుకో" అన్నాడు ధర్మలింగం. ఆమె సంకోచిస్తూ తీసుకోవడమైతే తీసుకున్నది గాని, ఆ చిరుకాంతిలో మెరసే వృద్ధప్రేమికుని కనుకొలకులలోని రెండు నిరాశాశ్రువులు మాత్రం ఆమెను కలతపరచినవి.

డి: ప్రభూ! ఆ మాంత్రికులు మన దర్బారులో ఉండతగ్గవారు.

మా: ప్రభూ. మీ అనుమతిలేకుండానే వారిని నా వెంట తీసుకొచ్చాను.

కు: సెహభాష్. నా మనస్సెరిగినవాడివి. నా ఇష్టాయిష్టాలు తెలిసినవాడివి. నా అనుమతిలేదని ఎందుకు సందేహిస్తావు మార్కో?

డి: ప్రభూ. వారిని రప్పించి ఉల్లాసం కల్గించరా?

మా: ఎవరక్కడ?...ఆ మాంత్రికులను ఇక్కడికి తోడ్కొనిరండి.

ప: చిత్తం ప్రభూ.

## 2

పరదేశీ! పరదేశీ!
ప్రణయముతో పలపించక
పయనమయి రావోయి
జీవా న్నొకనావ చేసి
దాటినావ సంద్రాలను
ఏటికో ఈ తీర్థయాత్ర
ప్రణయామృత తృప్తికొరక...పరదేశీ...
ఎన్నెన్నో దినాలనుండి
ఈ దిగులుతో వేచియుంటి
ఎరుగని ఈ ప్రణయానికి
తెరువరి నీవేనోయీ...పరదేశీ...
నీ కొరకై నా బ్రతుకొక
దీపకళిక యై నిలచెర
ఏనాటికి వెలిగింతువో
ఈ జీవనజ్యోతి సఖా...పరదేశీ...

మా: డిజల్మా...డిజల్మా.

డి: ఎవరది?

మా: (చెంతకు చేరి) రాకుమారీ. ఈ కొలను చెంతకూర్చుని ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?

డి: నీవా పరదేశీ. పియాన్ఫూనుంచి ఇంత త్వరలోనే తిరిగి వచ్చేశావే.

మా: మనస్సు చిత్రమైంది డిజల్మా! ఈ తనువుని పైచేయిగా ఉండనియ్యదు కదా.

డి: అదేమిటి? వేదాంతం మాట్లాడుతున్నావు పరదేశీ!

మా: షోకుంగ్ గురువు లేరీ?

డి: సమాధిలోనున్నారు. అన్నట్లు పరదేశీ, ఆయన నిన్న చెప్పారు.

మా: ఏమని?

డి: నీవూ అక్కడ నాకోసం ఈ తాత్కాలిక ఎడబాటు భరించలేకుండా తహతహ లాడి పోతున్నావని (చిన్నగా నవ్వుతుంది.)

మా: మరి నీగురించి ఏమి చెప్పారు వారు?

డి: నాగురించి చెప్పడానికి నే నేమైనా నీలా అంతర్థానమయ్యానా? నాగురించి ఎవ్వరికీ తెలియదు. తెలుసుకోలేరు కూడాను.

మా: ఒకరుమాత్రం తెలుసుకోగలరు. తెలుసుకుని నిట్టూర్పులు విడుస్తూంటాడు.

డి: మజ్నూ!

మా: అంతే. ఆలాగే ఐపోతానేమో డిజల్మా!

డి: ఇప్పుడు కొంప మునిగిపోయింది ఏమీ సంభవించలేదుగా?

మా: ప్రియా. నా నిర్వేదనా, నా హృదయంలో పదిలంగా ఇంతకాలం పట్టి భద్రంగా దాచుకుంటూన్న రహస్యం, చెప్పేయడానికే నేను కల్గే అపాయాలనుకూడా లెక్కచేయక జీవన్మృత్యువుల భయానక కేళిలో చిక్కకండా వచ్చాను. నన్నర్థంచేసుకో ప్రియా!

డి: తెలియనిదే ఎలా అర్థం చేసుకోను పరదేశీ?

మా: డిజల్మా నేను పరదేశినే! పరాయివాణ్ణే. ఒక వర్తకుణ్ణి. సాధారణ వ్యక్తిని. ఐనా సాహసించి నీచూపులలో నాచూపులనుకల్పుతున్నాను. నీ నామమంత్రం జపిస్తూ భగవదనుజ్ఞ పొందాను. చివరకు చక్రవర్తినికూడా మొండి ధైర్యంతో సాహసించి నీ కరం ప్రసాదించమని వేడుకున్నాను నన్ను—...

డి: (నవ్వుతూ) పరదేశీ ఇంత ప్రణయోపాఖ్యానమెందుకో?

మా: ప్రియా! ప్రభువు అనుమతివేరు. నీ అనుమతి వేరు.

డి: (కొంటెగా) ఐతే పరదేశీ నా అనుమతి తీసుకోకండా నా వైపు అలా గుచ్చుకునేలా ఎందుకు చూశావు? నేనుచూస్తే ఎందుకలా తన్మయతచెందుతూ వచ్చావు?

మా: నేను సుల్తాన్నుగాను...ఉత్త బికారిని... ఈ బికారి ధైర్యంచేసి చంద్రునికోసం చేతులు చాస్తున్నాడు. ప్రియా...అందని ఎత్తుకు ఎగిరితే ఏమైపోతానో అదే నా భయం.

డి: పరదేశీ! నాకు నగ్నంగా మాట్లాడడమే తెలుసు. ప్రణయానికి బీదసాదల ప్రమేయంలేదు. కంటకరహితమైన ప్రణయపథంలో సప్తపదాలు వేయడానికి నవాబైతేనేం?ఫకీరయితేనేం? కావలసింది హృదయం. తర్వాత గమ్యస్థానం.

మా: (ఉద్వేగంతో) ప్రియా!

డి: మన గురువులు పోకుంగ్ హితోపదేశం ఇదేగా. పరదేశీ, ఇవేళ నాహృదయం మయూరంలా నర్తించాలని పురి విప్పుతూంది. ఎందుకో సర్వం అమరధామంగా ఉంది ప్రియా. ఎంత కాలానికి తెరనుండి బయటపడ్డాయి మన బ్రతుకులు? మరిగే ఎదలో మూగజీవాలలా మనుగడ సాగించడం ఎంతబాధో తెలుసుకున్నాను.

మా: ప్రియా డిజల్మా.

డి: పరదేశీ.

ఒకనాటిది కాదీ గాధా-
పిననాటి దోయీ బాధా
పూర్వపు పుట్టుకలోనే
పూర్తిగ నీ వశమైతే
పూర్వపు సువాసనలతో
పుట్టితిమి నేడూ .... ఒకనాటిది ...
ఈ జన్మలు రెండూ
గురుదేవుని కొరకె ప్రియా!
బుద్ధం శరణం గచ్ఛామి
ధమ్మం శరణం గచ్ఛామి.

## 3

ప: ప్రభూ! పారశీకంనుండి రాయబారి.

కు: ప్రవేశపెట్టు. ఏమయ్యా అంతా క్షేమమా?

రా: చిత్తం. తమ సన్నిధికి ఉత్తరంతో వచ్చాను.

కు: మార్కో, తీసుకొని చదువు.

మా: "అన్నా. నేనుపెద్ద విపత్తు పాల్పడినాను. నా ప్రాణ ప్రియ, నా సతి దివంగతురాలైంది. మా ఇద్దరిమధ్యనుండే అన్యోన్యం వాత్సల్యం ప్రేమ మీకు సువిదితమే. ఇప్పుడు నేను ఏకాకిగా ఈ ప్రపంచంలో జీవించాలి. ఆమె అంతిమ కోరిక ఏమంటే నేను ద్వితీయ కళత్రాన్ని పొందాలని. ఆమె బంధువు మీ బంధువుట. అందుచేత ఆమె ఆత్మశాంతికై ఈ ద్వితీయ వివాహం తలపెట్టాను. కాబట్టి దయచేసి ఆమె బంధువైన డిజల్మాను నాకుఇచ్చి వివాహంచేయవలసిందని ప్రార్థిస్తున్నాను"ఖాన్-పారశీకము.

కు: (పెద్ద నిట్టూర్పుతో) హు-గోరుచుట్టుపై రోకలిపోటు. మార్కో ఏం చేయమంటావు?

మా: (వెర్రిగా) వీల్లేదు ప్రభూ.

కు: మిత్రమా, నాకు తెలుసు నీ మతి భ్రమించి పోతుందని. ఈ విషయంలో నా ఆజ్ఞ యెంత మాత్రం ఉపయోగించను. ఎందుకంటే కుబ్లాఖాన్ ఆడినమాట జవదాటడు. డిజల్మా విషయంలో నీ కిచ్చిన వాగ్దానం రద్దవదు. కాని ఈ పరిస్థితిలో ఒక నిశ్చయానికి రావలసినది నీవు. అందుచేత నీ అభిప్రాయం తెలుసుకో కోరుతున్నాను.

మా: (బాధతో) ప్రభూ!

కు: (జాలిగా) మార్కో

మా: భగవాన్. ఈ పరీక్ష ఏమిటికి? ఎటువంటి క్లిష్టసమస్య తెచ్చిపెట్టావు. ఈ సమస్య నేనెలా పరిష్కరించడం? ప్రభూ, మీ రిచ్చిన వాగ్దానం...

కు: జవదాటను నేస్తం. కాని ఈ పరిస్థితి నుండి, నిన్నూ నీతోపాటు నన్నూ, రక్షించుకొనే భారం నీది. ఒక్క విషయంమాత్రం నా కవగాహనవుతూంది. ఆ ఖాను భార్యావియోగి. నీవూ ఆ శిక్షే విధించుకోవాలేమో! ఇద్దరికీ వియోగవ్యథే. నన్నేంచేయ మంటావో చెప్పు?

మా: (దుఃఖంతో) నా నెత్తిమీద ఈభారం పెట్టవద్దని, ఇలా శిక్షించవద్దని, ఈ గాయపడిన హృదయం వేడుకుంటూంది. ప్రభూ మీరు మహాచక్రవర్తులు. సమర్థులు. మీ సేవకుణ్ణి. పైగా పరదేశిని. మీరే ఈ సమస్య పరిష్కరించి నే ననుభవించవలసిన శిక్ష ఏమిటో శాసించండి. ప్రేమించడంకూడా అపరాధమైపోయిందా భగవాన్? ఎందుకు నాలో ఈ వలపు, ఈ ప్రేమ, ఈ బెంగలూ కల్గించావు? నిన్న భూతలస్వర్గంలో వున్నాను. నేడు చీకటి ఆవహిస్తూంది నన్ను.

కు: నేస్తం నామాట వినవూ? నాకు తెలుసు నీ హృదయవేదన. నాకుతెలుసు నీ పరిస్థితి.నన్నేం చేయమంటావు? ఈ విషయంలో మాత్రం నేను జోక్యం కల్గచేసుకొని క్రూరంగా ప్రవర్తించలేను. పైగా నీకు వాగ్దానం ఇచ్చాను.

మా: నామీద నేను శిక్ష విధించుకుని ఆజన్మాంతం అశ్రుతప్తలోచనాలతో ఆ వైపు చూస్తూ చిరవియోగ మనుభవించవలెనా? ప్రభూ!

మీరు నిర్దయులు  మీ హృదయం పాషాణం. మీరు తీయనిబాధ కల్గించగలరు. ఏమానవుడైనా తా ననుభవించే శిక్ష తానే విధించుకోగలడా? అయ్యో!

నికోలో: మార్కో.

మా: ఏం నాయనా ..... నాకు తెలుసు ఈ సమయం సహాయంగా తిరిగి నన్ను మనదేశం తీసుకుపో యత్నిస్తున్నారు కాదూ?

ని: నామాట వినవా నాయనా? జీవితంలో ఎన్నో మృగతృష్ణలతో తారసిల్లుతాము. ఈ మృగతృష్ణలను వలచి పిచ్చివాడివైపోకు. మనం ఈ దేశం వచ్చింది వ్యాపారంకోసం. వర్తక సంబంధ మేర్పరచుకున్నాము. ఈ దేశంలో ప్రణయసంబంధా లేర్పరచుకోటానికి ప్రయత్నించావు. కాని భగవంతుని ఆజ్ఞలేదు. చక్రవర్తి పరమదయాళుడు. అందుచేత వారుచెప్పినట్లు, నీ ప్రణయానికి స్వస్తిచెప్పి,ప్రయాణమవు పోదాం.

మా: నాయనా మీరుకూడా ఈ పరిస్థితులను అండగాతీసుకుని నన్నిక్కడినుంచి లేవనెత్తి తీసుకుపోదామని ప్రయత్నిస్తున్నారు. కాని నేను నాదేశం రాలేను నాయనా. చితికిపోయిన గుండెతో ఎక్కడబ్రతికినా ఒకటే.... ప్రభూ. నా బాధలో మిమ్మల్ని ఏమైనా అనిఉంటే మన్నించండి. నాకిప్పుడర్థమైంది మీ జిజ్ఞాస .... మీరేం చేయలేదు. ఒక్కటే ఒక్క కోరిక ....

కు: నేను అడ్డుచెప్పను నేస్తం!

మా: ప్రభూ: నేను నా తండ్రితో మా దేశం వెళ్ళిపోవడానికి అనుజ్ఞ ఇవ్వండి.

కు: (ఆశ్చర్యంతో) ఎట్లా వెడతావు? నువ్వు నావాడివి మార్కో. నిన్ను విడిచి నేను ఉండగలనా?

మా: నాకుకల్గిన వియోగంకంటే నావల్ల మీకు కల్గే వియోగం అంత భరింపరానిదికాదు ప్రభూ.

కు: కాదు నేస్తం. నీవు నన్ను విడిచి వెళ్ళడానికి వీల్లేదు. నికోలో.

ని: ప్రభూ!

కు: మార్కోని మీతో తీసుకువెళ్ళడానికి వీల్లేదు.

ని: ప్రభూ. తమమాటకు ఎదురు చెప్పడానికి సాహసిస్తున్నాను. పదిహేడు సంవత్సరాలైంది మీ సన్నిధికి వచ్చి. మమ్మల్ని వెళ్ళనివ్వండి. మీరు చూపిన గౌరవమర్యాదలకు మేము ఆజన్మాంతం కృతజ్ఞులము.

మా: ప్రభూ. ఇక్కడవుంటే నేను మీకు ఎందుకూ పనికిరాను. ఆమె నివసిస్తూ వచ్చిన తావులలో నేను జీవిస్తూ వుండలేను. దయచేసినన్ను మన్నించి వెళ్ళడానికి అనుజ్ఞ ఇవ్వండి.

కు: నేస్తం. నాపై శిక్షవిధిస్తున్నావా? నిన్ను విడిచి ఈ రాజ్యభారం నేను వహించలేను మార్కో. నా మాట విను. నీవు మాత్రం నన్ను విడువకు.

మా: ప్రభూ! మీమాటకు ఎదురు చెప్పవలసి వస్తూంది. నన్ను మన్నించండి.

కు: సరే కానీ. నీ ఇష్టం,

మా: ప్రభూ! ఒక్కకోర్కె. డిజల్మా చాలా దూరం చాలా కాలం సముద్ర ప్రయాణం చేయాల్సివుంది. ఆమెను మాతో పపండి. సురక్షితంగా ఆమెను భర్తదగ్గర వదులుతాము. నేను నమ్మిన బంటును. ముందు కూడా నమ్మిన బంటుగానే ప్రవర్తిస్తా—ఆమెపై నున్న ప్రేమకోసమే ఆమెను ఇంకొకరికి అర్పించాను. అటువంటి నన్ను నమ్మరా ప్రభూ?

కు: నీమీద నా కెప్పుడూ విశ్వాసమే మార్కో. అలాగే కానియ్యి.

## 4

కొన్ని సంవత్సరాలు గడిచాక, భగ్నహృదయుడు మార్కో మరణశయ్యమీద.

స్నే: నాయనా మార్కో. ఈ సమయంలో భగవధ్యానం మంచిదేమో. వయస్సునంతా కలలకలకండ చప్పరిస్తూనే గడిపావు. ఈ సమయంలో—

మా: నేస్తం, కలలెంత పదును పెడతాయో తెలుసా జీవితానికి? కళ్ళకి కనిపించనివ్వకుండా కలలూ రానివ్వకుండా భగవంతుడు అంతు వేసిననాడు ఏనాడో దీర్ఘనిద్రలో మునిగిపోయి వుండేవాణ్ణి. నేస్తం, ఆ పటం కొంచెంతీసి చేతికివ్వవూ?

స్నే: ఎన్నిసార్లు చూచుకుంటావు మార్కో?

మా: (నిస్పృహగా నవ్వి) ఎన్నిసార్లంటావా? మీకు తెలియదు లెండి...ఆనాడు పారశీక దర్బారులో నన్ను పంపివేస్తూ...

డిజల్మా: పరదేశీ! ఈ బుద్ధభగవానుని పటం

పదిలంగా దాచుకో. ఇదే మనకి అనుబంధ రక్ష, భగవంతుని అంశలో పుట్టాము. కల్సుకున్నాం. భావిగురించి వెర్రికలలు కన్నాం. కాని...ఎందుకులే...తిరిగి మనం భగవంతుని దగ్గర కలుస్తాం. పరదేశీ, అంతవరకూ సెలవ్.

మా: అబ్బా! దేవతలా కనులు చమరుస్తూ ఎలా నన్ను సాగనంపింది!

స్నే: మారో్కే.

మా: డిజల్మా, ఆ సమయంకోసమే వేచి వున్నాను, నాచూపులు దిక్కులుమర్చిపోయాయి. ఒక్కదిక్కే తెలుసు వాటికి...పారశీకంవైపే తేరిబారి దీర్ఘంగా చూస్తాయి డిజల్మా.

స్నే: మారో్కే-మారో్కే.

మా: ఈ వెన్నీసు నగరంలో ఈ భూతల స్వర్గంలో నిన్ను తీసుకొచ్చి చిరస్థాయిగా ప్రాక్ పశ్చిమాలకిప్రణయవల్లకి నేర్పరుద్దామనుకున్నాను. బహుశా దేవతలకి ఇష్టంలేకపోయిందనుకుంటాను వారికికూడా మన ప్రణయంపట్ల ఎటువంటిఈర్ష్య.

స్నే: మారో్కే. లేవకు. పడుకో. మాట్లాడకు.

మా: డిజల్మా. వచ్చావా? నాకు తెలుసు నీవు నన్ను వెన్నంటే వుంటావని. మాట్లాడవేం? ఒక్కసారి నవ్వవూ? ఒక్కసారి.

స్నే: ఎవరితోటి మాట్లాడుతూంటు? మారో్కే ఒత్తిగిలి పడుకో.

మా: అదుగో డిజల్మా, ఎలా మెరిసిపోతూందో. అడ్డులే. నేను...నేనూ వచ్చేస్తున్నా. రాకుమారీ, రాకుమారీ, నేను వచ్చేస్తున్నా, అక్కడేగా మనం కలుద్దామనుకున్నాం.

స్నే: మారో్కే! మారో్కే!

మా: నడు. వచ్చేస్తున్నా ... డిజల్మా ... డిజల్మా...

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)

---

# నిశీధి నిశ్శబ్దంలో

భయంకర కాలరాక్షసి వెచ్చవెచ్చని నిశ్వాసాలకు
విశ్వసౌధ శిఖరాలపైకి - ప్రాకిన
ఆశావల్లికలు, కనరిపోవక
కుసుమించునా సుకుమార సుందరసుమాలు?
విరజిమ్మునా? తావులనెత్తావుల!
చివురించునా? చిర్నగవులు-
భయంభయంగా మెల్లమెల్లగా నడుస్తున్న
ఈ నిశీధి—
కనుపించని కాలరాక్షసి కీనీడల్లోంచి
వినిపించవా? వికటహాసలు,
మృత్యంగన గాఢ పరిష్వంగానికై
పరితపించు తనూవల్లిక
తమోరేఖలగుపడగానే, వనరిపోయిబెదరు
మందగమనానిలానికే—
మండిపోవు జ్వలదగ్ని అంగాలకు
ఎగసిన విషాదగీతాలకు, తెగిపోవునో
పరిస్పందితమౌ, హృద్విపంచికాతంత్రులు?
తెగినా,
హృద్విషదితరంగ మృదంగ భంగిమల
మధురధ్వనులు—
మృదుమధురారవాలు వినిపించవా?
నిశీధి- నిశ్శబ్దంలో—

—మాదిరాజు రంగారావు.